# విజయం


అక్షర సమరానికి నాంది..

పేజీలు : 08

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

శుక్రవారం /జులై 07 / 2023

https://vijayamdaily.com

## చారిత్రక ప్రదేశాలను చుట్టేస్తున్న ప్రజా ప్రతినిధులు

- తాజ్ మహల్ సౌందర్యాన్ని తిలకించిన ప్రజా ప్రతినిధులు
- ఇదంతా నామ చలువే
- నామ ఆలోచన అద్భుతం



న్యూఢిల్లీ / ఖమ్మం, జూలై 06 (విజయం న్యూస్):

బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు నేతృత్వం..నిర్దేశకత్వంలో న్యూఢిల్లీలో ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులు

➤ వివరాలు 02లో..

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

### నివాళ్లు అర్పించిన మంత్రి, కలెక్టర్

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

స్వతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, సమతావాదిగా, తన పాలనా దక్షతతో దేశానికి విశేష సేవలందించిన భారత మాజీ ఉప ప్రధాని డా. బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఘన నివాళులు అర్పించారు.



➤ వివరాలు 02లో..

## డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టాలి

### అధికారులతో సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ స్నేహలత



ఖమ్మం, జూలై 6(విజయం న్యూస్):

డెంగ్యూ వ్యాధి నివారణ ముందస్తు చర్యలపై గురువారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, విద్యాశాఖ, మునిసిపల్, రెవెన్యూ, పంచాయితీరాజ్, ఐ.సి.డి.ఎస్, డి.ఆర్.డి.ఏ. తదితర లైన్ శాఖలు డెంగ్యూ నియంత్రణకై సమన్వయంతో పనిచేయాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు మలేరియ, మెదడువాపు, చికున్ గున్యా, డెంగ్యూ, బోదకాలు మొదలైన వ్యాధులు వ్యాపిస్తున్న ప్రధానంగా డెంగ్యూ వ్యాధి నిర్మూలన మన అందరి బాధ్యతని, డెంగ్యూ వ్యాధి నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆమె అన్నారు.

➤ వివరాలు 02లో..



- డెడ్ స్టోరేజీ దిశగా అడుగులు
- జులైనెల వచ్చిన ప్రారంభం కానీ నాట్లు
- ఆందోళనలో రైతన్నలు

## అడుగంటిన పాలేరు జలాశయం..

### 7ఏళ్లతరువాత మొదటిసారి తగ్గిన నీటిమట్టం

జిల్లాకే తలమానకం.. 4లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్న జలాశయం.. మూడు జిల్లాలకు తాగునీటిని అందించే ప్రాజెక్ట్.. నాగార్జున సాగర్ నుంచి వచ్చే క్రిష్ణమ్మ నీటిని తీసుకొని, ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాకు పక్కనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాగునీటిని, తాగునీటిని అందిస్తున్నచెరువు ఇది.. ఎన్నో ఎళ్ల నుంచిఅత్యంత కరువు పీడిత ప్రాంతంగా ఉన్నపాలేరుజలాశయంను భక్తరామదాసు ప్రాజెక్టుతో అత్యంత నీటి సామర్థ్యం కల్గిన నియోజక వర్గంగా మార్చిన జలాశయం.. రాష్ట్రంలోనే అతిపెద్ద జలాశయంలో ఇది ఒక్కటి.. అలాంటి జలాశయం అడుగంటింది.. ఈ జలాశయం అని అనుకుంటున్నారా.. అయితే మా ఖమ్మం జిల్లా ప్రతినిధి అందించే ప్రత్యేక కథనం..

## మాది పేదల ప్రభుత్వం

- పోడు రైతులకు న్యాయం చేసింది సీఎం కేసీఆర్
- వెయ్యి కోట్ల విలువ చేసే 1707 ఎకరాల పోడు భూములకు హక్కు కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వం
- రఘునాథపాలెం మండలంలో పోడు పట్టాలను పంపిణి చేసి మంత్రి పువ్వాడ

➤ వివరాలు 03లో..

## పట్టణాభివృద్దే లక్ష్యం

- రూ.1.50 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పువ్వాడ
- ఎస్ డీఎఫ్ నుంచి రూ.90 లక్షలు, సుడా నుంచి రూ.60 లక్షలతో పనులు
- నగరాభివృద్దిలో భాగంగానే కోట్ల రూపాయలు నిధులు మంజూరు

(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో రూ.1.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంఖుస్థాపనలు, ప్రారంబోత్సం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరాభివృద్దిలో భాగంగా కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజలకు అవసరమయ్యే మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.



➤ వివరాలు 04లో..

# డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టాలి

**మొదటి పేజీ తరువాయి..**

వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధుల పట్ల, డెంగ్యూ వ్యాధి పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకొని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు ఐ.కే.పి సిబ్బంది, అంగన్ వాడి టీచర్ ప్రతిచోట కనిపించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మెప్మా సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అధికారులు సిబ్బంది విధుల్ని పర్యవేక్షణ చేయాలన్నారు. డెంగ్యూ వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా ఇంటి సభ్యులను భాగస్వామ్యం చేసి నీటి నిల్వలు లేకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. డ్రై డే ని పకడ్బందీగా చేపట్టాలని, డ్రైడే రోజు డ్రమ్ములు, నీటి పాత్రలలో ఉన్న నీటిని పారవేసి వాటిని శుభ్రపరచుకోవడం, లార్వాలు లేకుండా జాగ్రత్తలు పాటించడం, నీటిటాంకులు, నీటి స్టోరేజ్ పాత్రలు శుభ్రంగా ఉంచడం, దోమతెరలు వాడడం అలవాటు చేయాలన్నారు. పాఠశాలలు, హాస్టల్స్ లో దోమల పూర్తి నివారణ చర్యలు చేపట్టడానికి ఎం.ఈ.ఓ.లు కార్యక్రమంలో భాగస్వామ్యం అయి, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా, టాయిలెట్లు, వాష్ రూమ్ లు శుభ్రంగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలల, హాస్టల్స్ పరిసరాల్లో మురికినీటి నిల్వలు లేకుండా చూడాలి. వార్డెన్లు మిడ్ - డే మీల్ లో పాల్గొనే వారికి, వంటచేసే వారికి తప్పక టైపాయిడ్ టెస్టులు చేయించాలన్నారు. గ్రామ పంచాయితీ అధికారులు గ్రామపంచాయితీలో డెంగ్యూ నివారణ బ్యానర్లు కట్టాలని, విస్తృత ప్రచారం ద్వారా అవగాహన కల్పించాలన్నారు. వారంలో రెండురోజులు ప్రతి మంగళవారం, ప్రతి శుక్రవారం డ్రై డే తప్పక పాటించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వార్డును ఒక యూనిట్ గా పరిగణించి కార్యాచరణ తయారుచేసి దోమల నివారణపై రంగంలోకి దిగాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మంచుకొండ, కల్లూరు లోకల్, ఎం.వి.పాలెం, గంగారాం, లంకాసాగర్, నేలకొండపల్లి, చెన్నూర్, కొనిజెర్ల, ముదిగొండ, వేంసూర్, దెందుకూర్, ఖమ్మం అర్బన్‌లో శ్రీనివాస్ నగర్, వెంకటేశ్వరనగర్, మామిళ్లగూడెంలలో మొత్తం 711 కేసులు నమోదయ్యాయని, చికిత్స అందించి, కేసుల ఇంటిలోపల, బయట పైరిత్రం పిచికారి చేయించినట్లు ఆయన అన్నారు. ఐ.ఆర్.ఎస్. (ఇండోర్ రెసిడ్యూయల్ స్ప్రే) చేసే విధానం, దోమ లార్వాల నివారణ కోసం లార్వాసైడల్ మెజర్స్ లో భాగంగా మురికినీటి గుంటలలో టీమోపాస్, దోమల నివారణ కోసం మలాథియన్ ఫాగింగ్ చేయడం, నీటికాల్వలలో గంబూషియా చేపలను, ఆయిల్ బాల్స్ ను ఉపయోగించాలని, పి.హెచ్.సి. పరిధిలో ఈ మూడు నెలలు రాపిడ్ రెస్పాన్ టీమ్ ను ఏర్పాటు చేయాలని, టీంలో మెడికల్ ఆఫీసర్, సూపర్వైజర్, లాబ్ టెక్నీషియన్, డాటా ఎంట్రీ ఆపరేటర్ వుండాలని, ఇంటింటికి సర్వే నిర్వహించాలని, కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేయాలని, పి.హెచ్.సి.లలో చికిత్స అందించడానికి డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉన్నారని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. బి.మాలతి సమన్వయ సమావేశంలో పాల్గొన్న అధికారులకు డెంగ్యూ నివారణ చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జెడ్పి సిఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యా చందన, జిల్లా సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ప్రోగ్రాం అధికారి డా. సైదులు, ఇంచార్జి డెమో సాంబశివ రెడ్డి, ఎంపిడివోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఎంఈవోలు, ఎంపీఓలు, సిడిపిఓలు, సిఆర్‌పిలు, ఏపీఎం లు, అధికారులు పాల్గొన్నారు.

# చారిత్రక ప్రదేశాలను చుట్టేస్తున్న ప్రజా ప్రతినిధులు

**మొదటి పేజీ తరువాయి..**

విజ్ఞాన యాత్రను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. మూడో రోజు గురువారం రెడ్ పోర్ట్, తాజ్ మహల్ తదితర చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు చారిత్రక అంశాలను అక్కడి వారిని అడిగి తెలుసుకొని. విజ్ఞాన విషయాలను మననం చేసుకున్నారు. ఆగ్రా వెళ్లి అబ్బురపర్చే తాజ్ మహల్ కట్టడ సౌందర్యాన్ని తిలకించి, ఎంతో అనుభూతిని పొందారు. ఈ నెల 8వ తేదీ వరకు విజ్ఞాన యాత్ర కొనసాగుతుంది.



## ఇదంతా నామ చలువే...



ఎంపీ నామ నాగేశ్వరరావు చలువ వల్లనే తాము న్యూఢిల్లీ వచ్చి ఎన్నో తెలియని చారిత్రక కట్టడాలను సందర్శించ గలిగామని ప్రజా ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. పుస్తకాల్లో చదివిన చారిత్రక కట్టడాలను స్వయంగా చూసి, ఎంతో అనుభూతిని పొందడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు.సొంత ఖర్చుతో తమకు ఇవన్నీ చూపించిన ఎంపీ నామ నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు ...ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని పేర్కొన్నారు. నామ ఆతిధ్యాన్ని మర్చిపోలేమని అన్నారు.నామ చొరవ వల్ల ఎంతో వైజ్ఞానిక విజ్ఞానాన్ని సముపార్జించగలిగామని చెప్పారు. ఈ విజ్ఞాన పర్యటన తమ జీవితంలో మర్చిపోలేమన్నారు.ఎంపీ నామ నాగేశ్వరరావు వినూత్న ఆలోచన అద్భుతమని కొనియాడారు. ఈ విజ్ఞాన యాత్రలో కూసుమంచి జెట్పీటీసీ ఇంటూరి బేబి, ఇంటూరి శేఖర్, ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఎంపీపీ బెల్లం ఉమా , ఖమ్మం రూరల్ జెట్పీటీసీ యండపల్లి వరప్రసాద్, యండపల్లి సింధు, నేలకొండపల్లి జెట్పీటీసీ మరికంటి ధనలక్ష్మి , మరికంటి రేనుబాబు, రఘునాధపాలెం జెట్పీటీసీ మాలోత్ ప్రియాంక , మాలోత్ రాజా , చింతకాని మండల పార్టీ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య , చింతకాని జెట్పీటీసీ పరసగాని తిరుపతి కిషోర్ , మధిర మండల పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, పార్టీ మధిర పట్టణ అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వరరావు, ముదిగొండ జెట్పీటీసీ పసుపులేటి దుర్గ, పసుపులేటి వెంకటేశ్వర్లు, బోనకల్ మండల పార్టీ అధ్యక్షులు చేబ్రోలు మల్లిఖార్జునరావు, ఎర్రుపాలెం మండల పార్టీ అధ్యక్షులు పంబి సాంబశివరావు, ముదిగొండ మండల పార్టీ అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, కూసుమంచి మండల పార్టీ అధ్యక్షులు వేముల వీరయ్య, తిరుమలాయపాలెం మండల పార్టీ అధ్యక్షులు బాశబోయిన వీరన్న, ఖమ్మం రూరల్ మండలం నుంచి గూడ సంజీవ్ రెడ్డి ఉన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

**మొదటి పేజీ తరువాయి..**

గురువారం ఖమ్మం నగరం తెలంగాణ తల్లి సర్కిల్ నందు గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు పగడాల నాగరాజు, కొల్లు పద్మ, కంచర్ల దయాకర్, అరెంపుల వీరభద్రం, భాస్కర్, ఏడెల్లి బిక్షం, షకీన, నారమళ్ల వెంకన్న, షంశుద్దిన్, తన్నీరు శోబారాణి, యేచ్చు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్మికుల సమ్మె షూరు

**ప్రారంభించిన ఐఎఫ్టీయు రాష్ట్ర నాయకులు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వెంకన్న**

(కూసుమంచి-విజయంన్యూస్)

గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల వేతనం పెంచి పర్మినెంట్ చేయాలని రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో జూలై ఆరు నుండి సమ్మె పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలో సమ్మె శిబిరాన్ని రాష్ట్ర ఇఫ్ట్ నాయకులు ఐ వెంకన్న ప్రారంభించారు. సఫాయి కార్మికులు నిజమైన దేవుళ్ళని సెల్యూట్ పెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, స్వచ్ఛభారత్ లో ముందు బాగాన ఉన్న పంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిపి కార్మికుల్ని గవర్నమెంట్ ఉద్యోగులుగా గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలనిజీవో నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు 15600, కారోబార్, బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్లకు 19600 వేతనం పెంచి, పిఎఫ్ ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూర్ వెంకట్రాంరెడ్డి జిపి కార్మికులకు మద్దతు ప్రకటించారు రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి చెరుకుపల్లి వీరయ్య,ఐ ఎఫ్ టి యు. అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము అశోక్, కొరట్ల గణేష్, జంగిలి వెంకట్, ఏ ఐ టి సి ఖమ్మం జిల్లా కార్యదర్శి గుండెపంగు మల్లేష్ పాల్గొని ప్రసంగిస్తూ పంచాయతి కార్మికులకు ప్రమాద భీమా 10 లక్షలు సాధారణ మరణానికి ఐదు లక్షలు, బట్టలు, చెప్పులు, ఆయిల్, సబ్బులు, పరికరాలు ఇవ్వాలని, నరేంద్ర మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణలో అమలు చేయడం సాధ్యం కాదని అసెంబ్లీ తీర్మానం చేయాలని కార్మికులకు అండగా నిలవాలని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ను కోరారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ ఐఎఫ్ టీయు జిల్లా నాయకులు పిట్టల వీరయ్య, బుక్య రమేష్, కలకొండ గాంధీ, ఆరే శ్రీను, అప్పల వీరబాబు, కనక హరిమూర్తి, శీలం రమేష్, వెంకటేశ్వర్లు కూసుమంచి మండల 41 గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# శివాలయంలో ఉండి వితరణ

**(కూసుమంచి-విజయం న్యూస్)**

సొంత నిధులతో శివాల యం అభివృద్ధికి కృషి చేయడం నిజంగా అభినందనీయమని ఆలయ కార్యనిర్వాహణాధికారి కాముని శ్రీకాంత్ గారు అన్నారు.కూసుమంచి మండల కేంద్రంలోని పురాతన చరిత్ర కలిగిన శివాలయంలో ఆలయ చైర్మన్, వారి కుమారులు సుమారు 28,000రూ వితరణగా అందజేసిన ఉండిని గురువారం బహుకరణగా ఇచ్చారు. ఆ తరువాత పాత హుండీని లెక్కించగా 15 వేల రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, డైరెక్టర్ల సేవలను భక్తులు వినియోగించుకోవాలని. కార్య నిర్వహణ అధికారి, కాముని శ్రీకాంత్ గారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొక్కిరేణి వీరస్వామి, డైరెక్టర్లు మక్కపల్లి రామకృష్ణ, నలగాటి నాగయ్య, కట్ల, ముత్తయ్య, నెల్లూరి సత్యనారాయణ అర్వపల్లి వెంకటేశ్వర్లు, రవీందర్ రెడ్డి, ఆలయ అర్చకులు దేవరపల్లి శేషగిరి శర్మ, ఆలయ సిబ్బంది విజయలక్ష్మి పాల్గొన్నారు.



# మాది పేదల ప్రభుత్వం



**ఖమ్మం, జూలై 6(విజయం న్యూస్):** మాది పేదల ప్రభుత్వం.. పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. పోడు రైతులకు న్యాయం చేసిన ఏకైక సీఎం కేసీఆర్. పోడు రైతులను హక్కున చేర్చుకున్నారు. పోడు భూముల పట్టాలతో అన్ని ప్రభుత్వ ఫలాల లబ్ది చేకూరుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. గురువారం మంత్రి రఘునాథపాలెం రైతు వేదికలో రఘునాథపాలెం మండల పోడు రైతులకు పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఏ గ్రామంలో చూసిన ఎకరం 50 లక్షల రూపాయలకు తక్కువ లేదని, ప్రభుత్వం 800 కోట్ల నుండి 1000 కోట్ల రూపాయల విలువ చేసే 1707 ఎకరాల పోడు భూములకు హక్కుదార్లుగా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్ర పరిశీలన చేసి, గిరిజనులందరికి న్యాయం చేయాలని మంచి మనసుతో చర్యలు తీసుకున్నారని అన్నారు.



గ్రామ సభలు కేవలం గిరిజనులా కాదా అనేది చూశారని, అందరు గిరిజనులకు నిష్పక్షపాతంగా పట్టా పాస్ బుక్కులు అందజేశారని ఆయన తెలిపారు. పట్టా ద్వారా చాలా లాభాలు ఉన్నాయని ఆయన అన్నారు. వారం లోపల ఎకరానికి రెండు సార్లు 5 వేల రూపాయల చొప్పున రూ. 10 వేలు రైతు బంధు, ఒకవేళ దురదృష్టవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షల రైతుభీమా, గిరివికాసం పథకం క్రింద సబ్సిడీ బోర్లు, ఉచిత కరంట్, బ్యాంక్ ఋణాలు, ఎరువులు, విత్తనాలు అన్ని ఫలాలు అందుతాయని ఆయన తెలిపారు. పట్టాలు ధరణి లో పొందుపర్చినట్లు, పిల్లలకు ఇవ్వవచ్చని, పోడు భూముల పట్టాలు ఉన్న వారికి రాజకీయ పదవులు వస్తాయని మంత్రి అన్నారు. ప్రభుత్వం 75 వేల కోట్ల రూపాయలు రైతు బంధు క్రింద రైతుల ఖాతాలకు నేరుగా జమ అయినట్లు, ఉచిత విద్యుత్ ఇచ్చి వ్యవసాయానికి ప్రభుత్వం దన్నుగా నిలిచిందని ఆయన తెలిపారు. మొక్కజొన్న కు కనీస మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేసిందని, ఖమ్మం ఖానాపురం హావేలి మెయిన్ రోడ్ లో నిర్మించే వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్లో రఘునాథపాలెం మండల రైతులకు తాము పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి అవకాశం ఇస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ లింగాల కమలరాజ్ మాట్లాడుతూ, పట్టా రైతులకు అందే ప్రయోజనాలన్ని పోడు భూముల రైతులకు అందుతాయని అన్నారు. గిరిజన తండాలు, గూడెం లను ప్రభుత్వం గ్రామ పంచాయతీలుగా మార్చి, గిరిజనులకు స్వయం పాలన కల్పించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహాలత మొగిలి మాట్లాడుతూ, రఘునాథపాలెం మండలంలో 673 మందికి 1707.12 ఎకరాలకు పోడు భూముల పట్టాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. గత నెల 30 న 195 మందికి పట్టాల పంపిణీ చేయగా, నేడు మిగిలిన 478 మందికి పంపిణీ చేపట్టినట్లు ఆమె అన్నారు. పోడు భూముల పట్టాలతో రైతుబంధు, రైతుభీమా, గిరివికాసం అన్ని ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని అన్నారు. 16 గిరిజన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అభివృద్ధి నిధుల క్రింద గ్రామ పంచాయతీ భవనాలు మా మంజూరు అయ్యాయన్నారు. పోడు పట్టాల హక్కులతోపాటు, బాధ్యతలు ఉన్నాయని, అడవుల పరిరక్షణ చేయాలని, సమస్యలు వుంటే దృష్టికి తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం ఎంపిపి గౌరీ, ఎంపిడిఓ రామకృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ లక్ష్మ, వైస్ ఎంపిపి గుత్తా రవి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం నేత్రనిధికి నేత్రదానం..

### దాత కుటుంబసభ్యులకు ప్రశంసాపత్రం అందజేత..

**(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)**

ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్ ప్రాంతంలోగల దాత్రికలత గతనెల 26న పరమపదించారు...మృతురాలి భర్త మురళికృష్ణ, కుమారుడు శ్రావణ్ సిద్ధార్ద్, కూతురు ఆకాంక్ష, తండ్రి రానేరు తిరుపతయ్య, చెల్లి పంచిమర్తి పద్మగౌరీ మరియు కుటుంబ సభ్యులు కలిసి లత అంతిమ సంస్కారాలకు ముందు ఖమ్మం నేత్రనిధికి లత నేత్రాలను దానం చేశారు... కాగా గురువారం ఖమ్మం నేత్రనిధి ఆద్వర్యంలో, వారి కుటుంబ సభ్యులకు, భక్త కన్నప్ప పేరుతో ఖమ్మం నెత్రనిధి ప్రశంసాపత్రం మరియు , జ్ఞాపికను నేత్రనిధి సభ్యులు శ్రీ వెళ్ళంకి వెంకటేశ్వరరావు అందజేసారు. ఈనేత్రదానానికి, ప్రోత్సహించి, సహకరించిన కుటుంబ సభ్యులకు, నేత్ర నిధి కార్యదర్శి రాయపూడి అనంత పద్మనాభం, ఖమ్మం ఐ బ్యాంక్ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.. ఈ సందర్బంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. చనిపోయన వారి నేత్రాలను దానం చేస్తే, కార్నియా అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరి అంధులకు చూపు రావడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా, ఖమ్మం పట్టణంలో మరణించిన ఇతర ప్రాంతాల వారు నేత్రదానం చేసినట్లైతే, అట్టి భౌతిక కాయాన్ని వారి స్వస్థలానికి తరలించే నిమిత్తం ఉచిత వ్యాన్ సదుపాయం కల్పించడం జరుగుతుందని, . మనిషి చనిపోయిన 8 గంటల లోపుగా కంటి పైపొరను తీసినచో ఆ నేత్రాలు ఇతరులకు కంటి చూపును ప్రసాదిస్తాయని చెప్పారు. చనిపోయిన వెంటనే నేత్రనిధి ఫోన్ నెంబర్ 9397191919కి సమాచారం అందించినచో, ఇంటికే వచ్చి కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాల పై పొరలను (కార్నియా) తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతీఒక్కరు నేత్రదానాన్ని తమ కుటుంబ సాంప్రదాయంగా మర్చుకోవాలని సూచించారు.

## ప్రైవేట్ ఆస్పత్రిలో జర్నలిస్టులకు రాయితీ సౌకర్యం కల్పించండి

### ఐఎంఏకి టియుడబ్ల్యుజె (ఐజేయు) విజ్ఞప్తి

**(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)**

ఖమ్మం నగరంలో పనిచేసే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల కుటుంబ సభ్యులకు ఖమ్మం నగరంలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో ఫీజు రాయితీ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షులు డాక్టర్ బాగం కిషన్ రావుకి టి. యు. డబ్ల్యూ .జే (ఐ.జె.యు )ఖమ్మం జిల్లా కమిటీ గురువారం వినతిపత్రం సమర్పించింది. సమాజ హితం కోసం పత్రిక రంగాన్ని ఎంచుకొని గత కొన్ని సంవత్సరాలుగా సేవలందిస్తున్న జర్నలిస్టులు అరకొర వేతనాలతో ఇబ్బందులు గురవుతున్నారని, మరి కొంతమంది వేతనాలు లేకుండానే సమాజ సేవకు అంకితభావంతో కృషి చేస్తున్నారని, ఇలాంటి వారికి అనుకోని పరిస్థితులలో జర్నలిస్టు గాని అతని కుటుంబ సభ్యులు గానీ అనారోగ్యానికి గురైన సమయంలో వేలాది, లక్షలాది రూపాయలు వెచ్చించడం తలకు మించిన భారం అవుతుందని, జర్నలిస్టులు అందరికీ ప్రభుత్వం అందజేసిన హెల్త్ కార్డు కూడా చాలా ఆసుపత్రిలో పనిచేయడం లేదని, ఈ నేపథ్యంలో ఖమ్మం నగరంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రిలలో జర్నలిస్టు గాని అతని కుటుంబ సభ్యులు గానీ అనారోగ్య కారణాలు, ఇతర కారణాలతో హాజరైనప్పుడు గానీ లేదా ఆసుపత్రిలో చేరినప్పుడు గాని ఆయా ఆసుపత్రుల్లో లభించే అన్ని రకాల వైద్య సేవల్లో 50శాతం రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అన్ని ప్రైవేట్ చిన్న, పెద్ద ఆసుపత్రిలో జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు కన్సల్టెంట్ ఫీజు ఉచితంగా అందించాలని, బయో కెమిస్ట్రీ ల్యాబ్ ,స్కానింగ్, అల్ట్రాసౌండ్ ,తదితర విభాగాల్లో 50 శాతం రాయితీ సౌకర్యం ఇప్పించే విధంగా ఐ.ఎం.ఏ చొరవ తీసుకొని ఖమ్మం నగరంలోని అన్ని ప్రైవేట్ హాస్పిటల్ యజమానులను, డాక్టర్లను ఒప్పించాలని టి యు డబ్ల్యూ జే ఐజేయు జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. దీనికి స్పందించిన ఖమ్మం ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ బాగం కిషన్ రావు మాట్లాడుతూ ఈ అంశాన్ని ఐఎంఏ



జనరల్ బాడీ సమావేశంలో ఎజెండాగా చేర్చి జర్నలిస్టులకు సహకరించే విధంగా సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టియుడబ్ల్యూజే -ఐజెయు)ఖమ్మం జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యెగినాటి మాధవరావు ,నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాసరావు, ప్రెస్ క్లబ్ కోశాధికారి నామ పురుషోత్తం, నగర నాయకులు కళ్యాణ్, మేడి రమేష్, ఫోటో జర్నలిస్ట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మనఊరు-మన బడి కార్యక్రమ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### సమీక్ష సమావేశంలో అధికారులకు సూచించిన అదనపు కలెక్టర్

**ఖమ్మం, జూలై 6(విజయం న్యూస్):**

మన ఊరు-మన బడి కార్యక్రమంలో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహాలత మొగిలి అన్నారు. గురువారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో అధికారులతో మన ఊరు-మన బడి, ప్రత్యేక అభివృద్ధి నిధులు, బిసిలకు ఆర్థిక సహాయం లపై సమీక్షించారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో మండలం వారిగా చేపట్టిన పనులు, పూర్తయి పునఃప్రారంభం అయిన పాఠశాలలు, ఇంకనూ పూర్తి కాని పనుల గురించి అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పనుల పూర్తికి చాలా సమయం తీసుకున్నట్లు, రోజువారి పర్యవేక్షణ చేసి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల కేంద్రంలో మంచి వాల్ పెయింటింగ్ కి అనువుగా ఉన్న పాఠ శాలలు గుర్తించి, ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వాల్ పెయింటింగ్ పనులను స్థానిక సంస్థల ద్వారా చేపట్టాలన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల విషయమై ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షల పనులకు సంబంధించి చర్యలుచేపట్టాలన్నారు. మంజూరు పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనుల ప్రారంభానికి సమస్యలు ఉంటే, సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. బిసి లకు రూ. లక్ష ఆర్థిక సహాయానికి సంబంధించి వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అర్హుల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపిడిఓలు, మండల విద్యాధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అడుగంటిన పాలేరు జలాశయం..



(కూసుమంచి-విజయం న్యూస్)

రాష్ట్రంలోనే అతిపెద్ద జలాశయంగా పేరొందిన ఖమ్మం జిల్లా పాలేరు జలాశయం చాలా ఏళ్ల తరువాత ఎండుముఖం పట్టింది..23 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టం కల్గిన ఈ జలాశయం ప్రస్తుతం 9అడుగులకు చేరింది. మరో కొద్ది రోజులు కురవకపోతే జలాశయ నీటిమట్టం మరింత తగ్గే అవకాశం ఉంది. ఇలాగే ఉంటే పూర్తి స్థాయి డెడ్ స్టోరేజీకి చేరే అవకాశం ఉంది. దీంతో తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంది. గత ఏడు సంవత్సరాల క్రితం 2015లో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు నెల వరకు వర్షాలు రాకా, నాగార్జున సాగర్ నుంచి క్రిష్ణమ్మ నీళ్లు రాకపోవడంతో ఆనాడు పాలేరు జలాశయం అడుగంటింది.. డెడ్ స్టోరేజీకి చేరింది. ఆనాడు 23 అడుగుల సామర్థ్యం కల్గిన పాలేరు జలాశయం 6 అడుగులకు పడిపోయింది. ఫలితంగా సాగునీటికే కాదు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. పంటలు పండలేదు. బోర్ల కింద ధైర్యం చేసి వరిపంటను సాగుచేయగా, ఆ పంటలు సక్రమంగా పండలేదు. పంట భూములన్ని బీడు భూములుగా మారిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆ తరువాత సంవత్సరం నుంచి ప్రతి ఏడాది పాలేరు జలాశయం అలుగు పడింది. గతంలో ఒక ఏడాది అలుగు పడితే మూడేళ్ల తరువాత అలుగు పడేది.. 2016 నుంచి 2022 వరకు ఎన్నడు లేని విధంగా ప్రతి ఏడాది అలుగు పడిన పరిస్థితి ఉంది. ఒక్కోక్క ఏడాది ఎగువ నుంచి వచ్చే వరద నీటికి రెండు, మూడు సార్లు అలుగు పడిన దాఖలాలు ఉన్నాయి. కానీ 2015 తరహాలోనే నాటి కరువు పరిస్థితి ఇప్పుడు వచ్చేటట్లు కనిపిస్తోంది. జులై నెల వచ్చిన పెద్దగా చెప్పుకోతగిన వర్షం పడలేదు. చిరుజల్లులకే పరిమితమైంది. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ఎగువ రాష్ట్రంలో కూడా వర్షం కురవడం లేదు. దీంతో క్రిష్ణమ్మ ప్రాజెక్టులో తగిన నీటి సౌలభ్యం లేదు.



ఫలితంగా దిగువకు నీటిని విడుదల చేయడం లేదు.అందుకు గాను పాలేరు జలాశయం ఎండుముఖం పట్టింది.. డెడ్ స్టోరేజీకి చేరింది. 23 అడుగుల పూర్తి స్థాయి సామర్థ్యం కల్గిన పాలేరు జలాశయం ప్రస్తుతం 9అడుగులకు చేరింది. పరిస్థితి ఇలాగే ఉంటే ఆరు అడుగులకు పడిపోయి డెడ్ స్టోరేజీ కి చేరే అవకాశం లేకపోలేదు. అదే జరిగితే పాలేరు జలాశయం నమ్ముకుని జీవిస్తున్న ప్రజలందరికి ఇబ్బందులు తప్పవు. ఒక వైపు తాగునీటి ఇబ్బందులు, మరో వైపు సాగునీటి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. ఒక సీజన్ పంటలు పండకపోయిన పర్వాలేదు కానీ, డెడ్ స్టోరేజీకి చేరితే కచ్చితంగా తాగునీటి ఇబ్బందులు తప్పవు అని ప్రజలు చెబుతున్నారు.

### ఆందోళనలో రైతన్నలు

పాలేరు జలాశయం అడుగంటడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు భయాందోళన చెందుతున్నారు. పాలేరు జలాశయం ఆయకట్టులో జులై నెలలో వరినాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కనీసం ప్రారంభం కూడా కాలేదు. అక్కడక్కడ బోర్లు, బావుల కిందా వరినాట్లు వేస్తున్నారే తప్ప ఎక్కడ కూడా వరినాట్లు ప్రారంభం కాలేదు. పాలేరు జలాశయం అడుగంటడంతో ఆయకట్టు రైతులు పంటల సాగు చేసేందుకు భయపడుతున్నారు. పాలేరు జలాశయం, సాగర్ ఆయకట్టు కిందా రైతులందరు జూన్ లోనే నార్లు పోసి, జులై మొదటి వారం నుంచే వరి నాట్లు వేసుకుంటారు. కానీ పాలేరు జలాశయంలో ఆయకట్టు కిందా ఇప్పటి వరకు వరి నాట్లు సాగు కాలేదు. పాలేరు జలాశయం, పాత కాలువ ఆయకట్టు కిందా సుమారు 30వేల ఎకరాలు వరి సాగు అవుతుంది. నాగార్జున సాగర్ ఎడమ కాలువ రెండవ జోన్ కిందా సుమారు 2లక్షల ఎకరాలు సాగులోకి వస్తుంది. కానీ ఈ ఏడాది పాలేరు జలాశయం అడుగంటడంతో ఇప్పటి వరకు 5శాతం మంది రైతులు వరి నాట్లు వేయలేదంటే జలాశయం పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే రైతులందరు నార్లు పోసి సిద్దంగా ఉన్నారు. ఎప్పుడు వర్షాలు వస్తాయా..? ఎప్పుడు నాట్లు వేయాలని అనుకుంటున్నారు. కానీ ఒక వైపు వర్షాలు లేకపోవడం, మరో వైపు శ్రీశైలం, నాగార్జున సాగర్ లో నీటి సౌలభ్యం లేకపోవడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. పోసిన నార్లు పెరిగి ముదిరిపోతాయేమోనని భయపడుతున్నారు. అలాగే ప్రతి ఏడాది బోర్ల ఉన్న రైతులు వరినాట్లు వేసేవారు. కానీ ఈ ఏడాది బోర్లు ఉన్న రైతులు కూడా వరిపోలం సాగు చేయడం లేదంటే వారు ఎంత భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

### తాగునీటి ఇబ్బందులు తప్పవా..?

పాలేరు జలాశయం రోజురోజుకు అడుగంటుతున్న నీటి సామర్థ్యం చూస్తుంటే భవిష్యత్ లో తాగునీటి ఇబ్బందులు తప్పవనే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం పాలేరు జలాశయం 9 అడుగులకు చేరింది. మరికొద్ది రోజులు ఇలాగే వర్షం కురకపోతే పాలేరు జలాశయం అడగంటం ఖాయం. దీంతో పాలేరు జలాశయం నుంచి తాగునీటికి కూడా నీరు అందే పరిస్థితి ఉండదు. ఇప్పుడు పాలేరు జలాశయం నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా ఖమ్మం జిల్లాతో పాటు హుబూబాబాద్, సూర్యపేట జిల్లాలకు సుమారు 250 గ్రామ పంచాయతీలకు, 300 గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. మూడు ప్రాజెక్టులను నిర్మాణం చేసి శుద్ధిచేసిన నీటిని ప్రజలకు అందిస్తున్నారు. మిషన్ భగీరథ పథకం పైప్ లైన్ జలాశయంలో 7అడుగుల నీటిమట్టంలో నిర్మాణం చేశారు. ప్రస్తుతం 9అడుగలకు చేరింది. మరికొద్ది రోజులు ఇలాగే ఉంటే కొద్ది రోజుల్లోనే 6అడుగులకు నీటిమట్టం పడిపోయే అవకాశం ఉంది. ఫలితంగా తాగునీటి ఇబ్బందులు తప్పవని ప్రజలు భావిస్తున్నారు. అదే జరిగితే ఈ ఏడాది కరువు ఖాయమని చెబుతున్నారు. మరీ వానదేవుడు రైతుల బాధను అలకిస్తాడా..? ఏడాది మంచి వర్షాలను కురిపిస్తాడా..? రైతులు పంటలు సాగు చేస్తారా..?

### పొదుపుగా వాడుకోకపోతే మూల్యం తప్పదు

ఒక వైపు ఆకాశగంగ నేల వైపు చూడటం లేదు. వర్షాలు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు పడటం లేదు. ప్రాజక్టులలో నీటిమట్టం పడిపోతుంది.. ఈ క్రమంలో దిగువకు నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. చెరువుల్లో నీళ్లు ఉండే అవకాశం తక్కువే. చెరువులన్ని ఎండిపోయే ప్రమాదం ఉంది. నేలలో జలాలలు అడుగంటే పరిస్థితి కనిపిస్తోంది. ఈ క్రమంలో జిల్లా ప్రజలందరికి తలమానకమైన పాలేరు జలాశయంలో నీటిమట్టం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. జలాశయంలో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాల్సి ఉంది. వర్షాలు వచ్చే వరకు జాగ్రత్తగా వాడుకోవడం చాలా అవసరం. అది జరగకపోతే, జాగ్రత్తలు తీసుకోకపోతే మూల్యం తప్పదు. అందుకు గాను సంబంధిత ఇరిగేషన్, వ్యవసాయశాఖాధికారులు తక్షణమే అలార్ట్ కావాల్సి ఉంది. నీటి వాడకం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఉన్న నీటిని కనీసం తాగునీటి కోసమైనా వాడుకోవడం కోసం జలాశయంలో స్టాక్ పెట్టాలి. లీకేజీల పేరుతో దిగువకు నీటిని విడుదల చేస్తే ముందు భవిష్యత్ లో ప్రమాదం పొంచి ఉండే ప్రమాదం తప్పదు. మరి అధికారులు చొరవ తీసుకుంటారా..? వేచి చూడాల్సిందే..

# పట్టణాభివృద్దే లక్ష్యం



**మొదటి పేజీ తరువాయి..**

ఖమ్మం నగరం పలు డివిజన్‌లలో ఎస్‌డిఎఫ్ నిధులు రూ. 90 లక్షలు, సుడా నిధులు రూ. 60 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. 25ఏళ్లకు సరిపడే అభివృద్ధి కేవలం గడచిన ఐదేళ్లలో పూర్తి చేయ గలిగామని, అది తెలంగాణ ప్రభుత్వం వల్లే సాధ్యం అయిందన్నారు. ఎస్‌డిఎఫ్ నిధులు రూ. 90 లక్షలతో శంకుస్థాపన, సుడా నిధులు రూ. 60లక్షలతో సైడ్ కాల్వలు, సి.సి రోడ్స్ నిర్మాణ పనులు మొత్తం రూ. 1.50కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను నేడు ప్రారంభించడం జరిగిందన్నారు. నగరంలోని



4వ డివిజన్ పాండురంగపురంలో ఎస్‌డిఎఫ్ నిధులతో రూ. 90లక్షలతో నిర్మించనున్న సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు, 45వ డివిజన్ మామిళ్లగూడెంలో సుడా నిధులు రూ. 20లక్షలతో నిర్మించిన సి.సి రోడ్లు, డ్రెయిన్లను, 50వ డివిజన్ బైపాస్ రోడ్డులో గల ఎస్సీ కాలనీలో సుడా నిధులు రూ. 20 లక్షలతో నిర్మించిన సి.సి రోడ్లు, డ్రెయిన్లను, 53వ డివిజన్ గట్టయ్యా సెంటర్ వద్ద బోడేపూడి స్థూపం దగ్గర సుడా నిధులు రూ. 20లక్షలతో గట్టయ్య సెంటర్, 53వ డివిజన్‌లో సి.సి రోడ్లను మంత్రి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్లు దండా జ్యోతి రెడ్డి, బుడిగెం శ్రీను, రాపర్తి శరత్, పగడాల శ్రీవిద్య, మున్సిపల్ ఏంఈ కృష్ణలాల్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డిఈ స్వరూప రాణి, పగడాల నాగరాజు తదితరులు ఉన్నారు.

# యూనిఫాం సివిల్ కోడ్‌ను పూర్తిగా రద్దు చేయాలి

## లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దశరథ్ నాయక్

**తల్లాడ జూలై 06 (విజయం న్యూస్)**



కల్లూరు మండల కేంద్రంలోని హనుమతండా గ్రామంలో కల్లూరు మండల అధ్యక్షుడు బానోత్ నందు నాయక్ ఆధ్వర్యంలో ముఖ్య కార్య కర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా లంబాడీ హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరద్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం దశరథ నాయక్ మాట్లాడుతూ ఈ దేశంలో అధిక శాతము ఉన్నటువంటి బహుజనలు ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం క్రిస్టియన్ మత మైనార్టీ కులాలకు చెందిన వారు ఉన్నారు వారికి ఒక హక్కులను రాజ్యాంగ మించినటువంటి రిజర్వేషన్లను పూర్తిగా తొలగించడం కుట్రపూరితమైన ఈ చట్టం ఉంది కాబట్టి దానికి పూర్తిగా రద్దు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం ఉంది ప్రతి ఒక్కరు కూడా దీనికోసం పోరాటం చేయాల్సిన బాధ్యత కూడా ఈ ప్రజల మీద ఉంది ప్రజల మద్దెల మతాల మధ్యలో కులాల మధ్య గొడవలు సృష్టించి వారికి విచ్చనం చేసి రాజకీయం చేయాలని చూసే పార్టీ బిజెపి పార్టీ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతా ఉంది రాజ్యాంగం లేకుండా రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకొని ఇవాళ రాజ్యాంగాన్ని లేకుండా మనస్ఫూర్తిని అమలు చేయాలని చూస్తున్నానని ఈ ప్రభుత్వానికి కచ్చితంగా గద్దె దించుతాం కొంతమంది యూనిఫామ్ సివిల్ కోడ్ అనేది ముస్లిం వ్యతిరేక చట్టం అని కొందరు మూరు?లు ఇప్పటికీ అపోహాలో ఉన్నారు. వారి అజ్ఞానానికి నిజంగా జాలిపడాలి సిగ్గుపడాలి వాస్తవానికి యుసిసి అనేది ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, ఓబిసిల హక్కులను పూర్తిగా హరించివేయడానికి వారికి వ్యతిరేకంగా పన్నిన కుట్ర అని తెలియజేశారు.





### శీతల పండుగను ఒకే రోజు జరుపుకొని ఐక్యతను చాటాలి

#### సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు బానోతు శ్రీకాంత్ నాయక్

**ఏన్కూరు జూలై 6 (విజయం న్యూస్)**

ఈనెల 11న జరుపుకునే శీతల దాటుడు పండుగను మండలం వ్యాప్తంగా ఒకే ఈరోజు జరుపుకొని ఐక్యతను చాటుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు బానోత్ శ్రీకాంత్ నాయక్ అన్నారు.. గురువారం ఏన్కూరు లో మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ నాయక్ మాట్లాడుతూ గిరిజలకు ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. గిరిజన బంధు, గిరిజన బీమా అమలు చేయాలని కోరారు. సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని, అర్హులైన గిరిజనులకు గృహలక్ష్మి పథకం కింద 10 లక్షలు మంజూరు చేయాలని అన్నారు. నూతనంగా ఏర్పడిన గిరిజన పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించి ప్రత్యేక అభివృద్ధి ఏర్పాటు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాందాస్ నాయక్, బావ్ సింగ్ నాయక్, బోడ రాజు నాయక్, శోభన్ నాయక్ బాదావత్ శీను నాయక్, రాజశేఖర్ నాయక్, రాంబాబు నాయక్, వాసు నాయక్ తదితరులు పాల్గొన్నారు



### సమ్మె బాటలో పంచాయతీ సిబ్బంది

**తల్లాడ జూలై 06 (విజయ న్యూస్)**

తల్లాడ మేజర్ పంచాయతీ కార్మికులు సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణికి సమ్మె నోటీస్ అందించారు. మేజర్ గ్రామపంచాయతీలోని పనిచేసే సిబ్బంది తమ న్యాయమైన కోరికలను నెరవేర్చుటకు సమ్మె బాట పట్టారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు సమ్మెలో కూర్చుంటామని వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

## సేవా భావం బిజెపి తత్వం: బీపీ నాయక్

### బిజెపితోనే మార్పు, అధికారంలోకి వస్తాం: నెల్లూరి

**తల్లాడ జూలై 06 (విజయం న్యూస్)**



రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్, వైరా అసెంబ్లీ బిజెపి నేత బీపీ నాయక్ వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావులతో కలిసి భారీ స్వచ్ఛభారత్ కార్య క్రమంలో పాల్గొన్నారు. రూరల్ మండలంలోని గొల్ల పూడి గ్రామంలో బూత్ సమ్మేళనం కార్యక్రమం అధ్యక్షుడు కోసూరి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా వందమంది భారతీయ జనతా పార్టీ కార్యకర్తలతో సామూహిక స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేస్తూ పలు వీధులను శుభ్రం చేశారు. ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ 9 ఏళ్ల సేవ సుపరిపాలన సంక్షేమ పథకాల అమలు విషయాన్ని ప్రస్తావించుకొని స్వచ్ఛభారత్ కార్యక్రమం చేయడం జరిగింది, మార్పు కోసం బిజెపి పని చేస్తుందని, తెలంగాణలో కూడా మార్పు తథ్యమని బిజెపికి అధికారం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ విస్తారక్ సంతోష్, మండల అల్పకాలిక్ విస్తారక్ చిత్ర పాపారావు, ప్రధాన కార్యదర్శిలు దోసపాటి కళ్యాణ్, గుత్తా నాగేంద్రబాబు, శక్తి కేంద్ర ఇంచార్జ్ నరసింహారావు, బూత్ అధ్యక్షులు వీసం వెంకటేశ్వర్లు, వెంకట నారాయణ, అర్జున్, తదితర ప్రముఖ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఏన్కూరులో పంచాయతీ కార్మికులకు సమ్మె

**ఏన్కూరు జులై 6 (విజయం న్యూస్)**

గ్రామపంచాయతీ వర్కర్స్ రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం ఏన్కూరులో పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెను వెంకటేశ్వరరావు సిఐటియు జల్లా కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్ జిల్లా అధ్యక్షుడు,ఐ ఎఫ్ టి యు ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి శ్రీనివాస్ ఎస్కే లాల్ మియా ఏన్కూరు మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులంతా విధులు బహిష్కరించి నిరవేదిక సమ్మెలో పాల్గొన్నారు తమ సమస్యలు పరిష్కారం అంతవరకు పోరాటం కొనసాగుతుందని వారు అన్నారు గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని వారు అన్నారు ఏర్పడిన సమ్మెను నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఏర్పుల రాములు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు బూదూరి గాంధీ ముత్యాలరావు ఇల్లూరి బిక్షమయ్య షేక్ సలీమా నిర్మల కురువెళ్ళ గోపయ్య తదితరులు పాల్గొన్నారు

# ఫలించిన ఎంపీ నామ కృషి

### మధిరలో పద్మావతి, లింక్ ఎక్స్ ప్రెస్ రైళ్లకు హాల్ట్

### నామకు కృతజ్ఞతలు

**ఖమ్మం, జూలై 06(విజయం న్యూస్):**



ఎట్టకేలకు బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు అవిరళ కృషి ఫలించింది. పద్మావతి, లింక్ ఎక్స్ ప్రెస్ (ఎగువ) రైళ్లను మధిర రైల్వే స్టేషన్ లో నిలుపుదల చేస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారుల నుంచి నామ నాగేశ్వరరావుకు తాజాగా సమాధానం అందింది. మధిర దాని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, వ్యాపారులు, ఇతర ప్రముఖులు మధిర లో పద్మావతి, లింక్ ఎక్స్ ప్రెస్ (, ఎగువ ) రైళ్లను ఆపాలని చేసిన విజ్ఞప్తి మేరకు ఎంపీ నామ ఈ విషయమై గతంలో పలు మార్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కు లేఖలు రాయడం తో పాటు రైల్వే మంత్రిని స్వయంగా కలసి మాట్లాడి, చేసిన వినతి ఫలించింది. దీంతో ఈ నెల 5వ తేదీ నుంచి ఈ రెండు ఎక్స్ ప్రెస్ రైళ్లను మధిరలో కండీషల్‌గా 6 నెలలపాటు నిలుపుదల చేస్తున్నారు. మధిరలో ఆ రెండు ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగకపోవడం వల్ల మధిర, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను నామ స్వయంగా కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసికెళ్లడం జరిగింది. ఎట్టకేలకు తన ప్రయత్నం సత్ ఫలితాన్ని ఇవ్వడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ప్రజలంతా ఈ సౌకర్యాన్ని విరివిగా ఉపయోగించుకోవాలని ఎంపీ నామ కోరారు. రైల్వే అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆ రెండు రైళ్లు మధిరలో ఆగేలా కృషి చేసినందుకు మధిర ప్రాంత ప్రజలు నామ నాగేశ్వరరావుకు ప్రత్యేకించి కృతజ్ఞతలు తెలియజేశారు.

### చిన్నారిని ఆశీర్వదించిన ప్రముఖులు

**ఏన్కూరు జులై 6 (విజయం న్యూస్)**



ఏన్కూర్‌లోని సాయి ఠాగూర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో చిన్నారి ఇమ్రానా ను పలువురు ప్రముఖులు ఆశీర్వదించారు. గార్ల ఒడ్డు గ్రామానికి చెందిన సయ్యద్ హుస్సేన్, జాన్‌బిల కూతురు ఇమ్రానా ఓణిల అలంకరణ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, బానోతు విజయభాయి, ఎంపీపీ ఆరెం వరలక్ష్మి,వివిధ పార్టీల నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు చిన్నారి ఇమ్రానాను ఆశీర్వదించారు.